సాక్షి
నల్లగొండ
శుక్రవారం : 24 ఫిబ్రవరి 2023



సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఆలయ సన్నిధిలో కూచిపూడి నృత్యం చేస్తున్న వంద మంది కళాకారిణులు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మత్స్యాలంకృతుడై శేషవాహన సేవపై ఊరేగుతున్న స్వామివారు

మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌ఇన్



నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' శనివారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

ఫోన్ చేయాల్సిన తేదీ, 25.02.2023 (శనివారం)
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
సెల్ నంబర్ : **98489 71375**

న్యూస్‌రీల్

నేడు యాదాద్రికి గవర్నర్

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ రానున్నారు. ఉదయం 7.45కు రాజ్‌భవన్ నుంచి బయల్దేరుతారు. 8.45కు యాదాద్రి కొండపైకి చేరుకుంటారు. అనంతరం శ్రీస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 9 గంటలకు బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారు. 10.45కు తిరుగుపయనం కానున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు.

పోడు భూముల సమస్య పరిష్కరిస్తాం



దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చందంపేట : పోడు భూములకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి పట్టాలిస్తామని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. గురువారం నేరెడుగొమ్ము మండలంలోని చిత్రియాల గ్రామ సమీపంలో ఉన్న పాలపేడ అటవీ ప్రాంతంలోని భూములను అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కాచరాజుపల్లి, దాసర్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఈ ప్రాంత పోడు భూములకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. వీటిల్లో అర్హులను గుర్తించనున్నట్లు తెలిపారు. 2005కు ముందు నుంచి పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఎఫ్‌డీఓ సర్వేశ్వర్, ఎఫ్‌ఆర్‌ఓ సాయిప్రకాశ్, తహసీల్దార్లు దేవదాసు, అరుణ, ఎంపీడీఓ, ఎంపీటీసీ ఉన్నారు.

కూలీల సంఖ్య పెరిగేలా చూడాలి



బంగారిగడ్డలో నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా

చండూరు : ఉపాధి హామీ పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ కుష్బూ గుప్తా సూచించారు. గురువారం చండూరు మండల పరిధిలోని తాస్కానిగూడెం, కస్తాల, బంగారిగడ్డ, ఇడికూడ, బోడంగిపర్తి, శిర్దేపల్లి గ్రామాల్లో నర్సరీలు, మన ఊరు– మన బడి, క్రీడా ప్రాంగణాలు, ఫాంపాండ్ పనులను ఆమె పరిశీలించారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణ బాగుందని ఎంపీడీఓ యాకూబ్ నాయక్‌ను అభినందించారు. ఆమె వెంట డీఈఓ భిక్షపతి, పీఆర్ డీఈ రఘుపతి, ఏపీఓ శ్రీనివాస్, టీఏలు తదితరులున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : క్యాంపస్ ప్లేస్‌మెంట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. మొదట చిన్న అవకాశం వచ్చినా వినియోగించుకొని పెద్ద అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. అనేక కంపెనీలతో యూనివర్సిటీ ప్లేస్‌మెంట్స్ చేపట్టేందుకు ఎంఓయూ చేసుకుందని తెలిపారు. ఉద్యోగ మేళాకు 250 మంది అభ్యర్థులు పాల్గొనగా 105 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి తెలిపారు. కార్యక్రమంలో రమేష్, సుధీర్, సందీప్ పాల్గొన్నారు.

అప్పుడే మండుతున్నయ్!





మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా మారిన నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్, భాస్కర్ టాకీస్ సెంటర్



ఎండ తాకిడికి తట్టుకోలేక స్కార్ఫ్ కట్టుకుని వెళ్తున్న మహిళ

- ఫిబ్రవరిలోనే ముదురుతున్న ఎండలు
- ఈ నెలలో 32 నుంచి 36.5 డిగ్రీలకు పెరిగిన గరిష్ట ఉష్ణోగ్రతలు
- ముమ్ముందు ఎండల తీవ్రత ఎట్లుంటుందోనని జంకుతున్న జనం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో ఎండలు అప్పుడే మండిపోతున్నాయి. మార్చి కూడా రాలేదు... ఫిబ్రవరిలోనే అధికమయ్యాయి. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటాయోనని జనాలు జంకుతున్నారు. ఈ నెలలో ఇప్పటికే 36.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో మధ్యాహ్నం నీలగిరి పట్టణంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

పెరగనున్న ఎండలు
ఈసారి ఎండల తీవ్రత పెద్దఎత్తున పెరిగే అవకాశం ఉంది. వర్షాలు సకాలంలో పడడంతో చెరువులు కుంటలు నిండాయి. వరి సాగు కూడా పెద్దఎత్తున సాగు చేశారు. అయితే ఎండల తీవ్రత కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. ఫిబ్రవరి మొదటి నుంచే రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి.

గతేడాది కంటే అధికం..
గతేడాది ఫిబ్రవరిలో గరిష్ట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు కాగా, ఈనెల పూర్తి కాకముందే బుధ, గురువారాల్లో 36, 36.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత సంవత్సరం ఫిబ్రవరితో పోల్చితే ఈసారి 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఎక్కువగా పెరిగింది.

రోడ్లు నిర్మానుష్యం
ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మధ్యాహ్నానికి జనాలు రోడ్ల మీదకు రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. పట్టణంలోని రామగిరి సెంటర్‌లో వ్యాపారులు మధ్యాహ్న సమయంలో షాపులు బంద్ చేసి, సాయంత్రం సమయంలో తెరుస్తున్నారు. ప్రకాశం బజార్‌లో డివైడర్‌పై అరటి పండ్లు, కుండలు, ఇతరత్రా వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఎండ తీవ్రతతో మధ్యాహ్నం వేళ వ్యాపారాలు చేసే బండ్లకు చెద్దర్లు కట్టుకొని ఉండాల్సి వస్తోంది. ప్రకాశం బజార్ అంతా మధ్యాహ్నం వేళ జనం లేక బోసిపోతోంది. పట్టణంలోని ప్రధాన వీధులైన గడియారం సెంటర్, భాస్కర్ టాకీస్, రామగిరి రోడ్డు, హైదరాబాద్ రోడ్డులో కూడా జన సంచారం తగ్గుతోంది. దేవరకొండ, మిర్యాలగూడతోపాటు ప్రధాన పట్టణాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

ఈ నెలలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా..

తేదీ	ఉష్ణోగ్రత డిగ్రీల్లో	తేదీ	ఉష్ణోగ్రత డిగ్రీల్లో
01	31.5	08	34
02	32.5	09	34
03	33	10	34.5
04	35.5	11	35
05	33	12	35.5
06	33	13	35.5
07	33.5	14	34

16, 17, 18 తేదీల్లో 34.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, 19న 33.5 డిగ్రీలకు తగ్గింది. మళ్లీ 20వ తేదీన 34.5 డిగ్రీలకు పెరగగా, 21వ తేదీన 35 డిగ్రీలకు పెరిగింది. 22వ తేదీన 36 డిగ్రీలకు చేరుకోగా, 23వ తేదీన మరింతగా పెరిగి 36.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది.

రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

దేవరకొండ : దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణానికి భూ నిర్వాసితులు సహకరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గొట్టిముక్కల భూ నిర్వాసితులు, రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సేకరణ చట్టానికి లోబడే ప్రభుత్వం పరిహారం అందించనున్నట్లు రైతులకు తెలిపారు. ధరణిలో పొరపాట్లను సరిచేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. చట్టప్రకారం నిర్ధారించిన నష్టపరిహారాన్ని మిగిలిన భూ నిర్వాసితులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. చింతపల్లి మండల పరిధిలో ఆర్‌అండ్‌ఆర్ కింద ఇళ్ల స్థలాలు పొందిన రైతులకు ఇంటి నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఇప్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కాగా.. గొట్టిముక్కల భూ నిర్వాసితులు భూములు కోల్పోయిన వారికి రూ.5.15లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ తిరుగు ప్రయాణంలో పలువురు భూ నిర్వాసితులు కలెక్టర్ వాహనానికి అడ్డుగా వెళ్లి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ ఆర్డీఓ లీలా, సీఐ శ్రీనివాసులు, గొట్టిముక్కల సర్పంచ్ అయ్యన్న, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలు, పల్లె ప్రకృతి వనాల పరిశీలన
కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వన నర్సరీని, జానిగానితండాలోని బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. అదే విధంగా జానిగానితండాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ బాలరాజురెడ్డి, తహసీల్దార్ మండడి మహేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఏపీఓ రామచంద్ర నాయక్, ఈఓ వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ సరస్వతి తదితరులున్నారు.

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నిలిచిన పరీక్షలు

- రసాయనాలు లేకపోవడంతో వారం రోజులుగా అందని సేవలు
- నిలిచిన థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్‌తోపాటు 10రకాల పరీక్షలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



నల్లగొండలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రంలో మిషన్లు

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో గత వారం రోజులుగా వైద్యపరీక్షలు నిలిచిపోయాయి. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా 43 రకాల పరీక్షలను డయాగ్నోస్టిక్ సెంటర్‌లో అందిస్తుంది. ఖరీదైన పరీక్షలతో పాటుగా ఇతర రక్త పరీక్షలను ఈ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. మిషన్‌ల ద్వారా పరీక్షలు చేయడానికి అవసరమైన రీజెంట్స్(కెమికల్స్) అయిపోవడంతో గత వారం రోజులుగా పరీక్షలను చేయడం లేదు. ఖరీదైన, అత్యవసరమైన పరీక్షలైన థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్‌తో పాటుగా 10 రకాల పరీక్షలను నిలిపివేశారు. రీజెంట్స్ కోసం రాష్ట్ర స్థాయి అధికారులకు ఇండెంట్ పెట్టినప్పటికీ ఇప్పటి వరకు సరఫరా కాకపోవడంతో పరీక్షలను చేయడం లేదు.

ప్రైవేట్ సెంటర్లకు రెఫర్..
ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని రోగులతో పాటుగా జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పరీక్షల కోసం రక్తనమూనాలు ఇచ్చిన రోగులు రిజల్ట్ రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని వంద మంది, జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల ద్వారా సుమారు 600 మంది వరకు రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపిస్తుంటారు. ప్రతిరోజు పరీక్షలు నిర్వహించిన అనంతరం డయాగ్నోస్టిక్ సెంటర్ అధికారులు వారివారి సెల్ నంబర్లకు, అదేవిధంగా ఆయా కేంద్రాల వైద్యులకు పరీక్షల ఫలితాలను పంపిస్తారు. దీంతో ఆయా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల రిపోర్టుల ఆధారంగా రోగులకు వైద్య చికిత్సలను అందిస్తుంటారు. కానీ వారం, పది రోజులుగా పరీక్షలు నిలిచిపోవడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రోగులను మాత్రం ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లకు రెఫర్ చేస్తూ పరీక్షలను చేయిస్తున్నారని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల కోసం వేల రూపాయలను వెచ్చించాల్సి వస్తుందని జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి సహాయకుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరీక్షలకు అవసరమైన కెమికల్స్‌ను తెప్పించి పరీక్షలను చేయించాలని రోగులు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరడానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చూను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్య స్థాపనే ధ్యేయం

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్



నేరడలో పాదయాత్ర నిర్వహిస్తున్న విశారదన్ మహారాజ్

చిట్యాల: బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా తాను పాదయాత్ర చేపట్టినట్లు డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ తెలిపారు. ఆయన చేపట్టిన పది వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర గురువారం చిట్యాల మండలంలోని చిట్యాల, నేరడ, పిట్టంపల్లి గ్రామాల మీదుగా వెలిమినేడు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన పార్టీ దిమ్మెలపై ఆ పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. అణగారిన వర్గాలను మోసం చేసేందుకే రాష్ట్రంలోని వివిధ పార్టీల్లోని అగ్రకులాలకు చెందిన నాయకులు పాదయాత్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమాల్లో పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సైదులు, నాయకులు రాజేష్, బాబు, పరమేష్ పాల్గొన్నారు.

'ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌కు కట్టబెడుతున్న కేంద్రం'

నల్లగొండ : ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా ఆదాని, అంబానీల కంపెనీలకు కేంద్రం కట్టబెడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్, రాష్ట్ర నాయకుడు కొండేటి మల్లయ్య ఆరోపించారు. గురువారం నల్లగొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. సమావేశంలో పరమేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పదహారేళ్లయినా అసంపూర్తిగానే..

- 2007లో మిర్యాలగూడలో మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం
- తాళ్లగడ్డలో 30 ఎకరాలు, రాంనగర్‌లో మరో 20 ఎకరాల సేకరణ
- ఇప్పటివరకు పూర్తికాని పైపులైన్ల ఇంటర్ లింక్స్ పనులు
- మట్టితో నిండిపోయిన మ్యాన్‌హోళ్లు



రాంనగర్ వద్ద పైపులైన్‌కు లింక్ కలపకపోవడంతో నిరుపయోగంగా ఉన్న ప్లాంట్ స్టోరేజీ చెరువు



తాళ్లగడ్డలోని ఎస్‌టీపీ ప్లాంటు వద్ద వార్డుల నుంచి వచ్చే మురుగు నీరు చేరే బావి

మిర్యాలగూడ టౌన్ : భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మిర్యాలగూడ మున్సిపాలిటీలో రెండు సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేసేందుకు ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టింది. అందుకు కావాల్సిన భూమిని కూడా మున్సిపల్ శాఖ సేకరించింది. అయితే చాలా కాలంగా ఈ పనులు అసంపూర్తిగానే మిగిలాయి.

చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు..
మిర్యాలగూడ మున్సిపాలిటీలో మురుగునీటి వ్యవస్థ నుంచి వచ్చే నీటిని శుద్ధి చేసి పంట పొలాలకు అందించేందుకు ప్రభుత్వం 2007లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. ఈమేరకు తాళ్లగడ్డలో 30 ఎకరాలు, రాంనగర్ బంధం డంపింగ్ యార్డు వద్ద మరో 20 ఎకరాలను సేకరించింది. ఈ ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణ పనులను రాంకీ సంస్థకు అప్పగించింది. దీనికి అప్పటి ప్రభుత్వం మొదటి విడతలో రూ.33 కోట్లు మంజూరు చేసింది. మున్సిపాలిటీలో మొత్తం 170 కిలోమీటర్లు వరకు పైపులైన్ల నిర్మాణ పనులతోపాటు, సుమారు 7500 వరకు మ్యాన్‌హోళ్లు పూర్తి చేయడం, తాళ్లగడ్డ, రాంనగర్‌బంధం వద్ద నిర్మించే మురుగు ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణ పనులు రెండేళ్లల్లో పూర్తి చేసి అప్పగించే విధంగా రాంకీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. గుత్తేదారు కేవలం 158 కిలోమీటర్ల వరకు మాత్రమే పైపులైన్లు వేసి లింకులు కలిపారు. వివిధ వార్డుల నుంచి మురుగునీటి శుద్ధి ప్లాంట్ వరకు వెళ్లే పైపులైన్లకు లింకుల గ్యాపులు పూర్తి చేయకుండా సుమారు 12 కిలోమీటర్ల వరకు వదిలేశారు. ఒక్కసారిగా ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో గుత్తేదారు చేతులెత్తేశాడు. తిరిగి మిగులు పనులు పూర్తి చేసేందుకు 2000 సంవత్సరంలో కృషి సంస్థతో ఒప్పందం చేసుకొని 2014లో రూ.30 కోట్లకు ప్రభుత్వం ఒకసారి రూ.15 కోట్లు, మరోసారి రూ.6.60 కోట్లు మంజూరు చేసింది. 2019 నాటికి పనులను పూర్తి చేసి ఎస్‌టీపీ ప్లాంట్‌లను అప్పగించాలని గుత్తేదారుకు ఆదేశాలు ఇచ్చింది. పైపులైన్ల మధ్య ఇంటర్ లింక్స్‌లు పూర్తి కాకపోవడంతో పాటు డిస్ట్రిబ్యూషన్‌తో పాటు గ్యాప్‌లను కూడా సరిచేయలేదు. పైపులైన్లు వేసిన గుంతల్లో అక్కడక్కడ రాళ్లు అడ్డుపడడంతో నిలుపుదల చేసి పైపులైన్లు కొనసాగించారు. మున్సిపాలిటీలోని వార్డుల్లో వేసి మ్యాన్‌హోళ్లు ఒక వైపు మట్టితో పూర్తిగా పూడిపోగా మరోవైపు ఎక్కడికక్కడా పైపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పైపులైన్ నిర్మాణ పనులు కూడా సరిగా చేయకపోవడంతో ఈ భారం నాకెందుకు అని రెండవ సారి కూడా గుత్తేదారు చేతులెత్తేశాడు. మిగులు, పెండింగ్ పనులను చేపట్టేందుకు 2020 ఆగస్టులో టీయూఎఫ్‌ఐడీఎస్ పథకం కింద రూ.7 కోట్లు మంజూరు చేసింది. 2021లో ఆ పూడికతీత పనుల సమయంలో పైపులైన్ల వ్యర్థాలను తొలగించేందుకు పైపుల్లోకి వెళ్లడంతో ఇద్దరు కార్మికులు ఊపిరాడక మృతి చెందారు. దీంతో అప్పటి నుంచి ఎస్‌టీపీ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తిరిగినేటి వరకు కూడా పనులు ప్రారంభించలేదు.

నిరుపయోగంగా మారడంతో..
గత 16 సంవత్సరాలుగా ఎస్‌టీపీ ప్లాంట్లు నిర్మించకుండా నిరుపయోగంగా ఉండటంతో అటు ప్రభుత్వానికి ఇటూ తమకు కూడా ఎలాంటి ఉపయోగం లేకుండాపోయిందని పలువురు రైతులు వాపోతున్నారు. తాళ్లగడ్డ, రాంనగర్ బంధం ఎస్టీపీ ప్లాంట్ల వద్ద లక్షలాది రూపాయల విలువ చేసే జనరేటర్లు, పంపు హౌజ్‌లు, మోటార్లు, విద్యుత్ నియంత్రికలు, కార్యాలయ భవనాలు నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా ప్లాంట్లను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని తాళ్లగడ్డ, రాంనగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు జారీచేశాం
భూగర్భ మురుగు వ్యవస్థ పెండింగ్ పనులను చేపట్టేందుకు 2020 ఆగస్టులో టీయూఎఫ్ఐడీఎస్ పథకం కింద రూ.7 కోట్లు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాం. ఈ పనులు ప్రారంభించిన నెలరోజులకే ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. అతడికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం పైపులైన్లలో ఉన్న వ్యర్థాలను తొలగిస్తే చాలా వరకు సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.
– సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ ఈఈ, నల్లగొండ

మత్స్యావతారుడిగా.. శేష వాహన సేవలో

- కనుల పండువగా కొనసాగుతున్న యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు
- అలంకార సేవలకు శ్రీకారం చుట్టిన ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. గురువారం మూడో రోజు అలంకార సేవలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంలో ఉదయం నిత్యారాధనలు పూర్తైన తర్వాత ఆచార్యులు ప్రథమ ప్రాకార మండపంలో స్వామి వారిని మత్స్యావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పడమటి రాజగోపురం నుంచి బయల్దేరి ఉత్తరం, తూర్పు, దక్షిణ రాజగోపురాల ముందు నుంచి అలంకార సేవను ఊరేగింపుగా తీసుకెళ్లి పడమటి రాజగోపురం ముందు ఉన్న వేంచేపు మండపం వద్ద అలంకార సేవను అధిష్ఠించారు. సేవకు ముందు ఒక వైపు ఆలయ అధికారులు.. మరో వైపు ఆలయ ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు కూర్చొని స్వామి వారిని ఆరాధిస్తూ పారాయణం పఠించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, మోహనచార్యులు, ఆలయ అధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.


మత్స్యావతారంలో ఊరేగుతున్న స్వామివారు


శేష వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

సాయంత్రం శేషవాహనంపై ఊరేగింపు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆచార్యులు నిత్యారాధనలు నిర్వహించి రాత్రి 7గంటలకు స్వామి వారిని శేష వాహనంపై తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం వేంచేపు మండపంలో స్వామివారిని అధిష్ఠించి వేద మంత్రాలు, పారాయణాలు పఠించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేటి కార్యక్రమాలు ఇవీ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం, రాత్రి అలంకార సేవలను ఊరేగిస్తారు. ఉదయం 9 గంటలకు వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి7 గంటలకు హంస వాహన సేవ ఉంటుందని ఆచార్యులు పేర్కొన్నారు.

తిరు కల్యాణ వేదిక పరిశీలన


తిరు కల్యాణం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీసీపీ, ఆలయ ఈఓ

యాదగిరిగుట్ట: యాదాద్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 28న నిర్వహించే స్వామివారి తిరు కల్యాణ వేడుకకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి, భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర పరిశీలించారు. ఆలయ తూర్పు రాజగోపురం సమీపంలో ఉన్న బ్రహ్మోత్సవ మండపంలో కల్యాణ వేదిధికను కలెక్టర్, డీసీపీ ఖరారు చేశారు. భక్తులు కల్యాణ వేదిక వద్దకు ఎలా వస్తారు, వీఐపీల భద్రతకు సంబంధించి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు, స్వామి వారి సేవ ఎక్కడి నుంచి వస్తుందనే అంశాలపై ఆలయ ఈఓ గీతారెడ్డి, సివిల్ అధికారి దయాకర్‌రెడ్డితో చర్చించారు. భక్తులు, వీఐపీలు, ఆచార్యులు వచ్చే మార్గాల్లో గ్యాలరీలు, గేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తూర్పు రాజగోపురం ముందు సుమారు 3వేల మందికి పైగా భక్తులు కూర్చునే విధంగా, అదేవిధంగా క్యూకాంప్లెక్స్‌పై, ఉత్తర రాజగోపురం ముందు మరో 10వేల మందికి పైగా భక్తులు కల్యాణాన్ని తిలకించే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయాధికారులు కలెక్టర్, డీసీపీలకు తెలిపారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ అధికారులకు తెలియజేశారు. అనంతరం కలెక్టర్, డీసీపీలు స్వామి వారిని దర్శించుకున్నారు.


కర్ణాటక గాత్ర కచేరిని తిలకిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఈఓ గీతారెడ్డి తదితరులు


కర్ణాటక గాత్ర కచేరి చేస్తున్న టీకే సరోజ, టీకే సుజాత సిస్టర్స్

ఇంకా కొనసాగుతున్న పనులు


యాదగిరిగుట్ట పట్టణంలో మైకులు, లైట్లు బిగిస్తున్న కార్మికులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై మూడు రోజులు అవుతున్నా విద్యుత్ దీపాలు, మైకుల బిగింపు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయకపోవడంతో మైకుల్లో ఆధ్యాత్మిక పాటలు రాక, విద్యుత్ వెలుగులు లేక యాదాద్రి క్షేత్రంతో పాటు పట్టణం వెలవెలబోతుంది. తాత్కాలిక విద్యుత్ దీపాల కాంట్రాక్ట్ తీసుకున్న వారికి, అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ప్రధానాలయం ఉద్ఘాటన తర్వాత జరుగుతున్న తొలి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని చెప్పిన అధికారుల మాటలు ఉట్టి నీటి మూటలేనని భక్తులు విమర్శిస్తున్నారు.

ఎండలతో భక్తులకు ఇబ్బందులు

యాదగిరిగుట్ట: రోజురోజుకు ఎండలు దంచికొడుతుండడంతో యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపై సరైన నీడ సౌకర్యం లేకపోవడంతో భక్తులు భానుడి ప్రతాపానికి తట్టుకోలేకపోతున్నారు. తలపై మండుటెండకు తోడు కృష్ణశిలతో ఏర్పాటు చేసిన ఫ్లోరింగ్‌పై మండుతున్న కాళ్లతో గురువారం భక్తులు పరుగులు పెట్టారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక పలువురు భక్తులు క్యూలైన్ల నీడకు కూర్చున్నారు.


మండుటెండకు క్యూలైన్ నీడకు కూర్చున్న భక్తులు

సాంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయంలో గురువారం నిత్య పూజలు కొనసాగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన అష్టోత్తరం వంటి పూజలు నిర్వహించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.17,35,324 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.


పూజలు చేస్తున్న ఆచార్యులు

రెండు ఇసుక లారీలు సీజ్

కోదాడరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు కోదాడ రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ గనాత్కూర్ ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇసుక లారీలు మార్గమధ్యలోని చెక్‌పోస్టును తప్పించుకునేందుకు కాపుగల్లు మీదుగా వస్తుండగా ఆ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. రెండు లారీలను సీజ్ చేసి లారీ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

హాలియా: హాలియా వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం పట్టుకొని సీజ్ చేసినట్లు హాలియా ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు అనుముల గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు తక్కెళ్లపల్లి సైదులు, పిట్టల కొండల్, ప్రభాకర్, యడవల్లి రంజిత్, పులిమామిడి గ్రామానికి చెందిన బొమ్మపాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గండి చెరువులో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గండి చెరువులో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం తేలుతుండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని చెరువలో నుంచి బయటకు తీయించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడు మూడు, నాలుగు రోజులు క్రితమే చనిపోయినట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

కోదాడరూరల్: అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోదాడ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వంటికొమ్ము రాజారెడ్డి(46) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల లారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కోలుకున్న తర్వాత కూడా పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతుండటంతో జీవితంపై విరక్తితో గురువారం స్థానిక పెద్ద చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక ఫైర్ స్టేషన్ డ్రైవర్ భుక్యా శివాజీ సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు లక్ష్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

డిండి: మండల పరిధిలోని రుద్రాయగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రాయగుడెం గ్రామానికి చెందిన జాజాల రవి ఈ నెల 18వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఊర్కొండపేట వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా రవి ఆచూకీ లభించకపోవడంతో అతడి తండ్రి బాలకిష్టయ్య గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ స్టేషన్ రైటర్ ప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

రామగిరి(నల్లగొండ): కాలేజీకి వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువతి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని గంగన్నపాలెం గ్రామానికి చెందిన తండు రమేష్ పెద్ద కుమార్తె అఖిల(18) నల్లగొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డీఎంఎల్‌టీ(పారా మెడికల్ కోర్సు) ప్రథమ సంవత్సరం చదువుతుంది. అఖిల గత మూడు నెలల నుంచి కాలేజీకి వెళ్లకపోవడంతో తండ్రి మందిలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అఖిల సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మట్టయ్య తెలిపారు.

మహిళను వేధించిన వ్యక్తికి జైలు

చందంపేట: మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నల్లగొండ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ తేజు కార్తీక్ గురువారం తీర్పునిచ్చారు. వివరాలు.. మండలంలోని చంద్రునాయక్‌తండాకు చెందిన రమావత్ లక్ష్మణ్ గతేడాది అదే గ్రామానికి చెందిన మహిళను వేధించడంతో పాటు ఆమె భర్తను కత్తితో పొడిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడిపై ఆరోపణలు రుజువు కావడంతో గురువారం అతడికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తికి గాయాలు

డిండి: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన నల్ల కృష్ణయ్య డిండి మండల పరిధిలోని టి. గౌరారం గ్రామంలో గురువారం వివాహ వేడుకకు హాజరై తిరిగి స్వగ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో డిండి నుంచి దేవరకొండ వెళ్లే మార్గంలో ఖానాపూర్ గేటు సమీపంలో దేవరకొండ నుంచి డిండి వైపు వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో కృష్ణయ్య కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న బంధువులు కృష్ణయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ఆస్పత్రికి తరలించారు.

విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు

డిండి : ప్రయాణికులతో ఆర్టీసీ బస్సును అడ్డుకున్న వ్యక్తిపై మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం సాయంత్రం డిండి నుంచి వయా కందుకూరు మీదుగా దేవరకొండకు వెళ్తుంది. మార్గమధ్యలో కందుకూరు గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన, హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కె. శ్రీనువాసులు కొంతమంది వ్యక్తులో కలిసి ఇసుక ట్రాక్టర్‌లను నిలిపివేశాడు. అదే మార్గం గుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సును కూడా దాదాపు 2 గంటల పాటు ఆపాడు. దీంతో తమ విధులకు ఆటంకం కల్గించాడని కండక్టర్ శ్రీరామదాసు సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనువాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ స్టేషన్ రైటర్ ప్రసాద్ తెలిపారు.

డ్రిల్లింగ్ చేస్తుండగా పేలుడు.. ఒకరు మృతి

నార్కట్‌పల్లి: మండల పరిధిలోని గోపలాయపల్లి గ్రామ శివారులో ఐడీఎల్ ఫ్యాక్టరీ ప్రహరీ నిర్మాణంలో గురువారం ప్రమాదవశాత్తు పేలుడు సంభవించి ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ బొడిగె రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గోపలాయపల్లిలో ఐడీఎల్ కంపెనీకి సంబంధించిన స్థలానికి ఇరువైపులా ప్రహరీ నిర్మాణ పనులు గత 15 రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ పనులు చేసేందుకు గాను కంపెనీ యాజమాన్యం రంగారెడ్డి జిల్లాకు చెందిన రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి కాంట్రాక్ట్ అప్పగించింది. కాగా గురువారం ట్రాక్టర్‌తో డ్రిల్లింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. దీంతో సైట్ ఇంజనీర్ కోటగిరి సాయిలు, బందారు పరమేష్, ఎస్‌కే సయ్యద్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని హైదరాబాద్‌కు తరలించగా, కోటగిరి సాయిలు(29) చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోబోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలి


మధారిగూడెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జానారెడ్డి

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

హాలియా: రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌కు చరమగీతం పాడాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. అనుముల మండలంలోని మధారిగూడెంలో గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జానారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని, డబుల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రైతులకు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూ పంపిణీ వంటి హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని పిలుపు నిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువస్తే ప్రతి పేదవాడికి పక్కా గృహాలు, రుణమాఫీ, రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధర, సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, జూపల్లి శ్రీనివాస్, రిక్కల వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రిక్కల రామకృష్ణారెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, పాంపాటి శ్రీనివాస్, ఏసురాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎస్‌కే సర్వర్ తదితరులున్నారు.

గోదావరి జలాలు పెంపు

అర్వపల్లి: ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో యాసంగి పంటలకు నీటి అవసరం పెరిగింది. దీంతో నీటిపారుదలశాఖ అధికారులు గురువారం జిల్లాకు గోదావరి జలాలను పెంచారు. 1000క్యూసెక్కుల నీళ్లు వస్తుండగా ఒకేసారి 1700క్యూసెక్కులకు పెంచినట్లు నీటిపారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ అమర్ తెలిపారు. ఇందులో 69డీబీఎంకు 500, 70డీబీఎంకు 100, 71డీబీఎంకు 1,100క్యూసెక్కుల చొప్పు న వదులుతున్నట్లు చెప్పారు.


విద్యుత్ కాంతులతో మిరమిట్లుగొల్పుతున్న యాదాద్రి ఆలయం